క్లుప్తంగా

13న వాహనాల వేలం

అశ్వారావుపేటరూరల్: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 13న అశ్వారావుపేటలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద వేలం పాట నిర్వహిస్తున్నట్టు శుక్రవారం స్థానిక ఎక్సైజ్ సీఐ కె.సాంబమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు కేసుల్లో పట్టుబడిన నాలుగు ద్విచక్రవాహనాలకు ఈ వేలంపాట నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్న వారు హాజరుకావాలని కోరారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న మెజిస్ట్రేట్ సూరిరెడ్డి

మణుగూరు రూరల్: మండలంలోని సమితిసింగారం పంచాయతీ పరిధిలోని ఉడతానేనిగుంపులో గల నేనుసైతం ఆర్గనైజేషన్ వారి అమ్మనాన్న వృద్ధాశ్రయంలో మణుగూరు ప్రథమశ్రేణి జ్యుడిషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్ కె.సూరిరెడ్డి శుక్రవారం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆశ్రమం పరిసరాలను పరిశీలించి వృద్ధులకు అందజేస్తున్న సేవలపై, వసతి సౌకర్యాలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అంకం సర్వేశ్వరరావు, చిర్రా సరస్వతి, కామసాని మధుసూదన్, గద్దల సాంబ, రుద్ర వెంకట్, వాగబోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు..



ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న డాక్టర్ సంపత్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భద్రాచలం ట్రాఫిక్ పోలీసులకు జిల్లా ఔషధ నియంత్రణ అధికారి సంపత్ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. శుక్రవారం స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై తిరుపతికి ప్యాకెట్లను అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షులు పరిమి సోమశేఖర్, సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

మణుగూరు టౌన్: మండలంలోని పలు పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మణుగూరు వాసవీక్లబ్, వనితా వైభవం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారిని సన్మానించి పుస్తకాలు, పెన్నులు, స్వీట్‌బాక్సులు అందజేశారు. కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దోసపాటి నాగేశ్వరరావు, వాసవీక్లబ్ ప్రతినిధులు శ్యామ్, అంజలి, బండారు నర్సింహారావు, కడవెండి విశ్వనాథగుప్తా, శేషుకుమార్, సముద్రాల కృష్ణమూర్తి, కంకటాల సాయి, చిత్తలూరి రమేష్‌బాబు, యాకయ్య తదితరులు ఉన్నారు.

చిన్న అరుణాచలంలో ఉచితంగా వివాహాలు



వివాహం జరిపిస్తున్న శివనాగస్వామి

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం గ్రామంలోని శ్రీద్వాదశ జ్యోతిర్లింగ చిన్న అరుణాచలం ఆలయంలో పేద జంటలకు అన్ని ఖర్చులు భరిస్తూ ఉచితంగా వివాహం జరిపిస్తున్నట్టు ఆలయ వ్యవస్థాపకులు శివనాగస్వామి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పలు ఆదివాసీ జంటలకు వివాహం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివాహం చేసుకోవాలనే జంటలకు ఉచితంగా హిందూ సాంప్రదాయం ప్రకారం వివాహం నిర్వహిస్తామన్నారు.

పోస్టల్ సేవలపై నిర్లక్ష్యం

కరకగూడెం: మండలంలో పోస్టల్ సిబ్బంది విధులపై తీవ్ర నిర్లక్ష్యం కనబరుస్తున్నారని, ఎన్ని బ్రాంచ్‌ల్లో పోస్టాఫీస్, బ్యాంకింగ్ సేవలు సక్రమంగా అందుతున్నాయో సమాధానం చెప్పాలని సీపీఎం మండల కన్వీనర్ కొమరం కాంతారావు డిమాండ్‌చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నెలల తరబడి కొన్ని గ్రామాల్లో ఉత్తరాలు నిలిచిపోతున్నాయని, దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అవశేషాలు కాలిస్తే నష్టమే..



పొలంలో వరి కొయ్యలను కాల్చిన దృశ్యం

పంట వ్యర్థాల దహనంతో ముప్పు

- వ్యర్థాలు కాలడంతో భూసారం, పర్యావరణంపై ప్రభావం
- పొలాల్లో మంటలతో పెరుగుతున్న కాలుష్యం
- రైతులకు కరువవుతున్న అవగాహన

కరకగూడెం: రైతులు ఆరుగాలం శ్రమించి పంటలు కోసిన తర్వాత వరికొయ్యలు, పత్తి చెట్లను (దంట్లు) ఇతర పంటల అవశేషాలను తరచూ కాల్చడం గ్రామాల్లో ఒక సాధారణ ఆచారంగా ఉంది. ఈ పద్ధతి తక్కువ ఖర్చుతో త్వరగా భూమిని తదుపరి పంటకు సిద్ధం చేయడానికి సహాయపడుతుందని రైతులు భావిస్తారు. కానీ ఈ పద్ధతి పర్యావరణంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాలను చూపుతూ భూసారాన్ని కూడా దెబ్బతీస్తుంది. కాల్చే ప్రక్రియలో కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి హానికరమైన వాయువులు విడుదలవుతాయి. ఇవి వాయు కాలుష్యాన్ని పెంచి శ్వాసకోశ వ్యాధులు, గుండె సమస్యలు పొగమంచు వంటి అనారోగ్య సమస్యలకు దారితీస్తాయి. అదే సమయంలో ఈ వ్యర్థాల్లో ఉండే సేంద్రియ పదార్థాలు సూక్ష్మజీవులు, నత్రజని, భాస్వరం వంటి పోషకాలు కాలిపోవడంతో భూసారం కోల్పోతుంది. దీనికి ప్రత్యామ్నాయంగా కంపోస్టింగ్, మల్చింగ్, బయోచార్, హ్యాపీ సీడర్ వంటి యంత్రాల ఉపయోగం లేదా బయోగ్యాస్ ఉత్పత్తి వంటి స్థిరమైన పద్ధతులను అవలంభించవచ్చు. ఇవి భూసారాన్ని కాపాడడంతో పాటు పర్యావరణ హాని తగ్గిస్తాయి. వ్యవసాయ వ్యర్థాలను కాల్చడం స్వల్పకాలిక పరిష్కారంగా కనిపించినా దీర్ఘకాలంలో ఇది పర్యావరణం, మానవ ఆరోగ్యానికి హానికరం. కాగా నేటికీ వీటిపై రైతులకు అవగాహన శూన్యం. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

అవగాహన కల్పించాలి



పంట వ్యర్థాలను కాల్చడంపై సంబంధిత శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలి. పంట వ్యర్థాలను కాల్చకుండా ఏం చేయాలో గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి పంట వ్యర్థాలను కాల్చడంతో కలిగే నష్టాల గురించి రైతులకు తెలియజేయాలి. అదేవిధంగా ప్రత్యామ్నాయ పద్ధతులను ప్రోత్సహించాలి.

– కొమరం నర్సింహారావు, రైతు, మొగిలితోగు

వ్యర్థాలను కలియదున్నాలి..



పంట వ్యర్థాలను కాల్చడంతో పర్యావరణం, ఆరోగ్యం, భూమికి చాలా నష్టం జరుగుతుంది. ఈ పద్ధతి వల్ల అనేక రకాల హానికరమైన వాయువులు విడుదలవుతాయి. నేల సారం తగ్గి, భూమిలో ఉండే ఉపయోగకరమైన సూక్ష్మజీవులు చనిపోతాయి. దీనికి బదులుగా, పంట వ్యర్థాలను కంపోస్ట్ చేయడం, నేలలో దున్నడం లేదా జీవ ఇంధనంగా ఉపయోగించడం వంటి పద్ధతులతో పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు.

– ఛటర్జీ, ఏఓ, కరకగూడెం

పర్యావరణ సమస్యలు అనేకం..



కాల్చడానికి సిద్ధం చేసిన పత్తి దంట్లు

అవశేషాలను కాల్చడంతో నేలలోని సూక్ష్మజీవులు, కీటకాలు నాశనమవుతాయి. ఈ సూక్ష్మజీవులు నేల ఆరోగ్యానికి, పోషకాల రీ సైక్లింగ్‌కు చాలా ముఖ్యమైనవి. వీటి నష్టం వల్ల జీవవైవిధ్యం క్షీణిస్తుంది. ఇది పర్యావరణ వ్యవస్థల సమతుల్యతను దెబ్బతీస్తుంది. అంతేకాకుండా భూసారం కోల్పోవడంతో నేల సారవంతం తగ్గడం జరుగుతుంది. పంట అవశేషాలు నేలలో సేంద్రియ పదార్థాలను అందిస్తాయి. ఇవి నేల సారవంతాన్ని పెంచుతాయి. అవశేషాలను కాల్చడం వల్ల ఈ సేంద్రియ పదార్థం నాశనమవుతుంది. ఫలితంగా నేలలో కార్బన్ స్థాయిలు తగ్గుతాయి. ఇది నేల యొక్క నీటిని నిలుపుకునే సామర్థ్యాన్ని పోషకాల లభ్యతను తగ్గిస్తుంది.

భూసారానికీ ప్రమాదమే..

పంట అవశేషాలలో నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. వీటిని కాల్చడం వల్ల ఈ పోషకాలు గాలిలోకి ఆవిరైపోయి వట్టి బూడిద మాత్రమే మిగులుతుంది. ఫలితంగా పంట దిగుబడి తగ్గి రైతులు ఎక్కువ రసాయన ఎరువులపై ఆధారపడాల్సి వస్తుంది. ఇది దీర్ఘకాలంలో భూమిని మరింత దెబ్బతీస్తుంది. ఈ పద్ధతి ఆర్థికంగా కూడా నష్టదాయకం ఎందుకంటే ఎరువులు, పురుగుమందుల ఖర్చు పెరుగుతుంది. దీని వల్ల రైతులు ఎక్కువ రసాయన ఎరువులను ఉపయోగించాల్సి వస్తుంది. ఇది ఖర్చును పెంచడమే కాక, నేల ఆరోగ్యాన్ని మరింత దెబ్బతీస్తుంది.

సాగులో జాగ్రత్తలు తప్పనిసరి



విత్తనాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

అశ్వారావుపేటరూరల్: పంటల సాగులో రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచించారు. మండల పరిధిలోని మల్లాయిగూడెం గ్రామంలో శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా స్థానిక రైతులకు వానాకాలం సీజన్ పంటల సాగు, జాగ్రత్తలు, ఎరువుల వినియోగం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడీఓ రవికుమార్, ఏవో శివరాం ప్రసాద్, హెచ్‌వో వేణుమాధవ్, ఏఈవోలు సతీష్, షాకిరా బాను, రవీందర్, సూరిబాబు, రైతులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతతో భూగర్భజలం ఆదా



గుంతను పరిశీలిస్తున్న ఏడీఏ

మణుగూరు రూరల్: కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని గుట్టమల్లారంలో గల రైతువేదికలో ఏర్పాటు చేసిన మూడు ఇంకుడుగుంతలను మణుగూరు వ్యవసాయశాఖ ఏడీఏ బి.తాతారావు శుక్రవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంకుడుగుంతలను ఏర్పాటు చేసుకోవడంతో వర్షపునీరు వృథాకాకుండా సంరక్షించి భూగర్భజలాలను ఆదా చేసుకోవచ్చన్నారు. ప్రతీ రైతు తమ బోరు బావుల వద్ద, నీటి చేరే పల్లపు ప్రాంతాల్లో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకుని భూగర్భజలాలను పెంచుకోవాలన్నారు. అలాగే నీటి కుంటలను ఉపాధిహామీ పథకం ద్వారా రాయితీపై తవ్వి పంటలను ఎండిపోకుండా కాపాడుకోవచ్చన్నారు. రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో నీటి కుంటలను కచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కొమరం లక్ష్మణ్‌రావు తదితరులు ఉన్నారు.

అర్హులకు అందని సంక్షేమ ఫలాలు



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

భద్రాచలంఅర్బన్: అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు విమర్శించారు. భద్రాచలం పట్టణ సమస్యలు పరిష్కరించాలని సీపీఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ముందు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు స్థానిక సమస్యలపై ఇంటింటి సర్వే నిర్వహించి పార్టీ దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమయిందన్నారు. ఇందిరమ్మ కమిటీల పేరుతో రాజకీయ జోక్యం కారణంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు రావడం లేదని అనర్హులకు ఇళ్లు మంజూరు అవుతున్నాయన్నారు. సుభాష్ నగర్ శివారులో పొడిగిస్తున్న కరకట్ట పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పి.సంతోష్ కుమార్, సీతాలక్ష్మి, పట్టణ కమిటీ సభ్యులు నాదెళ్ల లీలావతి, అజయ్ కుమార్, కొలగాని రమేష్, డి.కనక శ్రీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠ మహోత్సవం

మణుగూరు రూరల్: మండలంలోని గుటమల్లారం పంచాయతీ బోడేపూడినగర్‌లో గల శ్రీ భద్రకాళి ఆలయ ప్రాంగణంలో శివలింగం, నంది, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని నందిపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శుక్రవారం శ్రీ సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున గణపతి పూజలు చేసి ఉత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించి వేదపండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు చేసి ఆలయంలో విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా అన్నప్రసాద వితరణ చేపట్టారు.

ప్రతిష్ఠ వేడుకల కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మువ్వా, తదితరులు

ములకలపల్లి: మండలపరిధిలోని నర్సాపురంలో లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం కరపత్రాలను నీటి సారుదల శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయబాబు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ నెల 29, 30, 31 తేదీలలో నిర్వహించే ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కమిటీ బృందం మువ్వాకు ఆహ్వానపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు యర్రగొర్ల రామారావు, గుంట్రు సాయి, మరీదు నాగు, బజ్జూరి కృష్ణ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

చర్ల: మండలంలోని గుట్టబోరు కొత్తూరు తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి ఎద్దడిని నివారించాలని కోరుతూ పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోకుండా నర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దీంతో తాము తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొంటున్నామని ఈ సందర్భంగా మహిళలు వాపోయారు.

అశ్వారావుపేటరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని వికలాంగుల కాలనీ వాసులు తాగునీటి కోసం జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. వారం రోజులుగా కాలనీకు తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో అవస్థలు పడుతున్నామని వాపోయారు. తాగునీటి పథకానికి సంబంధించిన విద్యుత్ మోటరు మరమ్మతులకు గురి కాగా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ మేరకు రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కాలనీ వాసులతో మాట్లాడి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పడంతో రాస్తారోకోను విరమించారు.

అల్లూరి ఆశయాలు సాధించాలి



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గుమ్మడి నర్సయ్య

ములకలపల్లి: అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పిలుపునిచ్చారు. మండలపరిధిలోని పాతగుండాలపాడు గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్లూరి విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కళాజాత ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నాయకులు కెచ్చెల రంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు ముద్దా భిక్షం, కల్లూరి కిషోర్, నూపా భాస్కర్, పోతుగంటి లక్ష్మణ్, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి సంయుక్త మండలాల కార్యదర్శి కొర్సా రామకృష్ణ, నూపా సరోజిని, కల్లూరి పద్మ, మడకం విజయ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఫాసిజం ధోరణి నశించాలి



మాట్లాడుతున్న అర్జున్

దమ్మపేట: మన దేశంలో శ్రామికులు, రైతుల హక్కులను హరించేలా ప్రవర్తిస్తున్న పాలకులు, పెట్టుబడిదారుల ఫాసిజం ధోరణి పూర్తిగా నశించాలని, సీపీఎం నాయకులు పిట్టల అర్జున్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం సామ్రాజ్యవాద వ్యతిరేక దినం పురస్కరించుకుని మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ... ప్రస్తుతం దేశంలో ఫాసిస్టు ధోరణులకు వ్యతిరేకంగా సామాన్య ప్రజలను చైతన్యవంతం చేసి, పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దొడ్డా లక్ష్మినారాయణ, మొరంపూడి శ్రీనివాసరావు, కొప్పుల శ్రీను, మురహరి రఘు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన పలువురు మాజీ మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ మేరకు తల్లాడలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన తోటమళ్ళ బాలయోగి, ప్రముఖ వ్యాపారులు బచ్చు శ్రీనివాస్, శ్రీరంగం భార్గవ్, కొనకల్ల వేణుగోపాల్, న్యాయవాది మల్ల సత్యనారాయణతో మరో 20 మంది పార్టీలో చేరారు. వీరికి కేటీఆర్ పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, వనమా వెంకటేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, మానె రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ కూలి రేట్లు పెంచాలి

మణుగూరు రూరల్ : పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి హామీ కూలీ రేట్లు పెంచాలని సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి డిమాండ్ చేశారు. శుక్రవారం ఉపాధి హామీ కూలీలతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అత్యధిక పేదవారు ఉన్న ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కావాలనే తక్కువ నిధులు కేటాయించిందని, కూలీలకు రోజుకు రూ.700 ఇవ్వాలని, అన్ని రకాల సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ వార్డ్ మెంబర్ కణితి సత్యనారాయణ, వజ్జా వెంకటేశ్వర్లు, వేర్పుల నరేష్, ఏఐటీయూసీ కోశాధికారి కొత్తపల్లి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రమేష్



నూతన కమిటీతో ప్రభాకర్‌రెడ్డి, తదితరులు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): బీజేపీ మండల అధ్యక్షుడిగా జబ్బురి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా మొగిలి రామకృష్ణ, బన్నే శ్రీనివాసరావు, పి.వెంకటరెడ్డి, ఒగ్గు నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. నాయకులు బాల వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

టెట్ పరీక్షకు నిమిషం నిబంధన

మణుగూరు టౌన్: టెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు కేంద్రానికి గంట ముందు చేరుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని, నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రానికి అనుమతి లేదని ప్రభుత్వ మణుగూరు మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కో ఆర్డినేటర్ నాగముని నాయక్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ... మంగళవారం ఉదయం 11 గంటల నుంచి జరిగే పరీక్షకు ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడవని, హాల్‌టికెట్ లేని వారు పాస్‌పోర్ట్ ఫొటోపై గెజిటెడ్ ఆఫీసర్‌తో సంతకం చేయించుకుని ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు నిబంధనలు గుర్తించి మండలంలోని మూడు పరీక్షా కేంద్రాలకు సకాలంలో హాజరవ్వాలన్నారు.

ఎండను సైతం లెక్కచేయకుండా..

- ఉపాధి హామీ పనులపై కూలీల ఆసక్తి
- ‘ఆత్మీయ భరోసా’ కోసం ముందడుగు
- కనీసం 20 రోజులైనా పనులు ఉండాలనే నిబంధనతో పరుగులు
- కూలిరేట్లు పెరగడంతో పనులపై మరింత ఆసక్తి




కుర్నపల్లిలో ఉపాధి పథకంలో భాగంగా నీటి కుంట నిర్మాణ పనులు చేస్తున్న కూలీలు

చర్ల: మండలంలో ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. వేసవితాపాన్ని సైతం లెక్క చేయకుండా పనులు చేయడానికి కూలీలు ఆసక్తిని కనబరుస్తున్నారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లోనూ ఈ పనులు వేగంగా కొనసాగుతుండగా, రోజుకు సగటున 1,300 మంది కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరవుతున్నారు. మండలంలో 4,200 ఉపాధి హామీ కార్డులుండగా ప్రస్తుతం వ్యవసాయ పనులు కొనసాగుతున్నప్పటికీ ఉపాధి పనులకు కూలీలు హాజరవుతున్నారు. ఉదయం కనీసం మూడు గంటల పాటు పనిచేస్తే సగటున రూ.260 కూలి వస్తుండడంతో కూలీలు ఉపాధి హామీ పనుల్లో పాల్గొనేందుకు తెల్లవారుజాము నుంచే పరుగులు తీస్తున్నారు.

‘భరోసా’ ప్రకటనతో..

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని నిరుపేదలు సంవత్సరానికి (ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 లోపు) 20 పని దినాలు పూర్తి చేసి ఉంటే ఆ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.12 వేలను చెల్లిస్తామని ప్రకటించింది. దీంతో భూమిలేని నిరుపేదలకు పెద్ద ఎత్తున ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్నారు. మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల పనులపై ఆసక్తిని చూపుతూ పెద్ద ఎత్తున పనుల్లో పాల్గొంటుండడంతో పనులు కొనసాగే ప్రాంతాల్లో సందడి నెలకొంటోంది. ఉదయం 11 గంటల నుంచి ఎండ తీవ్రత పెరుగుతుండడంతో కూలీలు తెల్లవారుజామున 5 గంటల నుంచే పనులకు వెళ్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రస్తుతం వ్యవసాయ క్షేత్రాల్లో నూతన రహదార్ల నిర్మాణాలు, పంట పొలాల్లో నీటి నిల్వ కోసం నీటి కుంటలు, ఫారెస్టు భూముల్లో ట్రంచ్ కటింగ్ వంటి పనులు కొనసాగుతుండగా, రైతులు రబీ పంటల సాగు పూర్తయిన తరువాత పంటనీటి కాలువల్లో పూడిక తీత, కాల్వల మరమ్మతులు, ఇంకుడు గుంతలు తీయడం వంటి పనులు కూడా చేపట్టేందుకు ఉపాధిహామీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఉపాధి హామీ పనులతో ఊతం



ఎండాకాలంలో కూడా పనులు కొనసాగుతుండడంతో మాకు ఉపాధి కలుగుతోంది. ఉదయం పూట వెళ్లి 9.00 గంటల వరకు పని చేస్తున్నాం. రూ.250కు తగ్గకుండా కూలి పడుతోంది. ఏ విధమైన కూలీ పనులు లేని సందర్భాల్లో కూడా ఈ పనులు కొనసాగుతుండడంతో మా లాంటి పేదలకు ఈ పని ఎంతగానో ఉపయోగపడుతోంది.

– ఇర్పా వీరస్వామి, ఎర్రబోరు

కూలీల సంఖ్య పెరుగుతోంది..



మండలంలో ఉపాధి పనులకు కూలీల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. జనవరిలో 300 మంది ఉండగా నేటికి 1,300 మంది ఉన్నారు. ఈనెల చివరికి మరింతగా కూలీల సంఖ్య పెరుగుతుంది. 20 రోజులు పని దినాలు ఉండాలన్న నిబంధన ఉండడంతో భూమిలేని నిరుపేద లు పెద్ద సంఖ్యలో పనులకు హాజరవుతున్నారు.

– యూ.సాంబశివరావు, ఈఓ ఇన్‌చార్జ్ ఏపీఓ, ఎన్ఆర్ఈజీఎస్, చర్ల